క్లుప్తంగా

శ్రీకాళహస్తీశ్వరునికి పట్టువస్త్రాల సమర్పణ



ఈవో బాపిరెడ్డికి పట్టువస్త్రాలను అందజేస్తున్న ప్రమీలమ్మ దంపతులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి చెన్నై అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి తరఫున పట్టణానికి చెందిన డాక్టర్ ప్రమీలమ్మ దంపతులు శుక్రవారం అందజేశారు. ఈవో బాపిరెడ్డి వీటిని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమీలమ్మ మాట్లాడుతూ దీపావళి సందర్భంగా స్వామి అమ్మవార్లకు ఈ నూతన పట్టువస్త్రాలను అలంకరించేందుకు అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి వీటిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ మురళీధర్, ఏఈవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులపై అవగాహన



మినరల్ మిక్చర్ అందజేస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: పాడి రైతులు పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీఏ మునిరాజా తెలిపారు. మండలంలోని ఆర్.అనంతాపురం గ్రామంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకులమిషన్, ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ సౌజన్యంతో పశువుల్లో గర్భకోశ వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మినరల్ మిక్చర్‌ను రైతులకు ఉచితంగా అందజేశారు. లేగ దూడలకు నట్టల నివారణ మందులతో డీ వార్మింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వార్షిక ఆడిటింగ్

రేణిగుంట: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వార్షిక ఆడిటింగ్ ప్రారంభమైంది. ప్రతి సంవత్సరం నిర్వహించే సాధారణ ఆడిటింగ్ లో భాగంగా శుక్రవారం అమరావతి నుంచి నలుగురు, జిల్లా నుంచి ఐదుగురు అధికారులు కార్యాలయం చేరుకొని ఆడిటింగ్ నిర్వహిస్తున్నారు. ఆడిటింగ్ పూర్తయిన తరువాత నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు వివరించారు. లుపుతున్నారు.

నిత్యకల్యాణోత్సవం

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి శుక్రవారం వైభవంగా నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణంలో స్వామి అమ్మవార్లకు ముందుగా పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామి అమ్మవార్ల కల్యాణఘట్టం జరిగింది.

డిప్యూటీ ఎంపీడీఓగా షణ్ముగం



సత్యవేదు: డిప్యూటీ ఎంపీడీఓగా టీపీ షణ్ముగం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నారాయణవనం మండల కేంద్రంలో గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై సత్యవేదు ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా చేరారు. ఈ సందర్భంగా సత్యవేదు మండలంలోని పంచాయతీ సెక్రటరీలు ఆయన్ను శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మునిరవికుమార్, శైలేంద్ర కుముద, పద్మనాభరాజు, ప్రకాష్, ఉషారాణి, సుజాత, మణికంఠ, శివయ్య, లవకుమార్, జ్ఞానప్రవీణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన సదస్సులు విజయవంతం



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి శుక్రవారం వరకు చేపట్టిన సీపీఆర్ అవగాహన సదస్సులు విజయవంతమైనట్లు ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గూడ్లూరు మయూర్ అన్నారు. ఓ ప్రైవేటు కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నం వడ్డిస్తున్న సుభాన్ మిత్ర బందం

రేణిగుంట: పట్టణంలోని పోస్టాఫీసు వీధిలో ఉన్న కేఎల్ఎం ఆటో స్టాండ్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం సుభాన్ మిత్రులతో కలిసి పేదలకు అన్నదానం చేశారు. పేదలకు ఒక పూట కడుపునిండా అన్నం పెట్టాలన్న సంకల్పంతో కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. రాజేంద్ర, రంగయ్య, అప్పారెడ్డి, తిమ్మారెడ్డి, షణ్ముగం, వసీం, మదీనా పాల్గొన్నారు.

నేతన్నకు మొండిచేయి

- చేనేతలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- అమలు కాని 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం
- అందని రూ.25 వేల ఆర్థిక సాయం



వరదయ్యపాళెం మండలంలో మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

అధికారం కోసం ఎన్నికల సమయంలో ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, అధికారం చేజిక్కాక వాటిని విస్మరించడం సీఎం చంద్రబాబునాయుడుకు అలవాటుగా మారిందనే విమర్శలు తప్పడం లేదు. అన్ని వర్గాల మాదిరిగానే చంద్రబాబు మాయమాటలకు చేనేత కార్మికులు కూడా మోసపోయారు. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి తరఫున చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. సత్యవేదు నియోజకవర్గంలో చేనేత కుటుంబాలు 500 పైగా ఉన్నాయి. వీరంతా సాధారణ చేతి మగ్గాలపై నేత నేస్తున్నారు. కూటమి హామీ ఇచ్చిన మేరకు వీరంతా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందేందుకు అర్హులు. కానీ ఒక్క కుటుంబానికి కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కావడం లేదు. గత ప్రభుత్వంలో మాదిరిగా 100 యూనిట్ల వరకు మాత్రమే ఉచిత విద్యుత్ వర్తిస్తోందని, ఆపై వినియోగించే విద్యుత్‌కు బిల్లులు వస్తున్నాయని నేతన్నలు చెబుతున్నారు. –వరదయ్యపాళెం

చేనేత కుటుంబాలకు, పవర్ లూమ్స్‌కు ఉచిత విద్యుత్ అమలు చేసేలా కూటమి ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో జీఓ నెం.44 విడుదల చేసింది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు జీఓలో స్పష్టం చేశారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం రోజున ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అయితే నేటికీ అమలుకు నోచుకోలేదు. జీఓ ఇచ్చి ఆరునెలలు, చంద్రబాబు మళ్లీ మాట ఇచ్చి రెండు నెలలు గడిచిపోయినా పథకం అమలుపై అతీగతి లేకపోవడంపై నేతన్నలు మండిపడుతున్నారు.

నేతన్నకు దక్కని భరోసా

చేనేత కుటుంబాలను ఆదుకునేందుకు నేతన్నలకు ఏడాదికి రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని నేతన్న భరోసా పథకం కింద అందిస్తామని గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ ఏడాది ఆగస్టు 7 నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆ పథకాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. నేతన్నలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం చేనేత కుటుంబాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయడంతో పాటు నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతీ నేతన్నకు ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సహాయం అందజేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సహాయం నిలిచిపోయింది. దీంతో నేతన్నలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. సొసైటీలు పనిచేయక మధ్యవర్తులిచ్చిన మజూరీతో జీవనం సాగిస్తున్నామని నేతన్నలు వాపోతున్నారు. ఉచిత విద్యుత్‌తో పాటు ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం తమను ఆదుకోవాలని చేనేతలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో మండలాల వారీగా నేతన్న నేస్తం లబ్ధిదారుల వివరాలు:

మండలం		లబ్ధిదారుల సంఖ్య
జీఎన్‌కండ్రిగ	-	56
నాగలాపురం	-	13
నారాయణవనం	-	311
సత్యవేదు	-	17
వరదయ్యపాళెం	-	84

ప్రోత్సాహం లేదు



చేనేత కార్మికులు చాలీచాలని ఆదాయంతో జీవనం సాగిస్తున్నాం. సరిగ్గా పనులు దొరకడం లేదు. ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి ప్రోత్సాహం లేదు. వయస్సు పైబడుతున్నా పింఛన్లు ఇవ్వడం లేదు. ఉచిత కరెంటు, ఆర్థిక సహాయం అందించాలి.

–రామలింగయ్య, చేనేత కార్మికుడు, మరదవాడ, వరదయ్యపాళెంమండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



సొసైటీల ద్వారా ముడి సరుకులు ఇవ్వకపోవడంతో మధ్య దళారులు ద్వారా వచ్చిన ఆర్డర్లను నేసుకుంటూ వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో బతుకుతున్నాం. 50 ఏళ్లకు పింఛన్ ఇస్తామన్నారు. ఇక్కడ 50 ఏళ్ల వారెవరికీ పింఛన్ రావడం లేదు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తించలేదు. ఏడాదికి ఇస్తామన్న రూ.25 వేల ఆర్థిక సహాయమూ అందలేదు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ తమను ప్రభుత్వం ఆదుకోవాలి.

–బుర్రా కృష్ణమూర్తి, చేనేత కార్మికుడు, వరదయ్యపాళెం

ఆదమరిస్తే.. అంతే సంగతులు



వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం కూడలిలో ఇరుక్కుపోయిన వాహనం

వరదయ్యపాళెం: ఈ చిత్రంలో కనిపిస్తున్న మినీ లగేజీ ఆటో వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం చెక్‌పోస్టు కూడలి వద్ద శ్రీకాళహస్తి–తడ ప్రధాన ఆర్ అండ్‌బీ రోడ్డు మార్గంలో ఏర్పడ్డ బావిని తలపించే గుంతలో ఇరుక్కుపోయింది. గోవర్ధనపురం కూడలిలోని మద్యం దుకాణం ఎదురుగా ఇటీవల రోడ్డు మరమ్మతులకు గురై గుంత ఏర్పడింది. వాహన రాకపోకల తాకిడికి ఆ గుంత కాస్త బావిని తలపించే స్థాయికి పెద్దదైంది. దీంతో కురిసిన వర్షానికి గుంత నిండా నీరు చేరడంతో అటుగా వెళ్తున్న వాహనాలు గమనించలేక ఇరుక్కుపోతున్నాయి. దీంతో వారి అవస్థలు అన్నీఇన్నీ కావు. బస్సులు, ఇతర భారీ వాహనాలు సైతం గుంతను దాటలేక పోతున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి తక్షణమే గంతను పూడ్చి, ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

అభివృద్ధికి పెద్ద పీట

సత్యవేదు: అభివృద్ధికి మాత్రమే పెద్దపీట వేస్తామని సత్యవేదు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన అధికారుల రివ్యూ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. విలేకరులు చిన్న సమస్యలను వార్తల వరకూ తీసుకెళ్లకుండా తన దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీడీఓ మాలతీ, తహశీల్దార్ రోశయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాలపై వీడిన నిర్లక్ష్యం






రాళ్లకుప్పంలో కొళాయి వద్ద చల్లిన బ్లీచింగ్, గిరిజన కాలనీలో చేపట్టిన పారిశుధ్య పనులు

వరదయ్యపాళెం: వర్షాకాలంలో ప్రభుత్వ రక్షిత నీటి పథకాల నిర్వహణపై అటు పాలకులు, ఇటు అధికారులు చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ ఈ నెల 15న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ప్రజల నివేదన అన్న కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. నీటి పథకాల నిర్వహణపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వరదయ్యపాళెం మండలంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలిమ తాగునీటి ట్యాంకులను ఆయా పంచాయతీ శాఖ అధికారులు శుభ్రం చేయించాలని ఆదేశించింది. ఆ మేరకు సత్యవేదు మండలం పెద్దఈటిపాకం పంచాయతీలోని మిట్టకండ్రిగ గిరిజనకాలనీలో పిచ్చిమొక్కలతో ఉన్న తాగునీటి బావిని స్థానిక పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు మొక్కలను తొలగింపజేశారు. రాళ్లకుప్పంలో వర్షపునీటి మధ్యలో ఉన్న తాగునీటి కుళాయి ప్రాంతంలో వర్షపునీటిని తొలగింపజేసి ఆ ప్రాంగణంలో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు.

పంట పొలాలను ముంచెత్తుతున్న వరదనీరు





రహదారి పక్కన నిర్మించిన కాలువల గ్యాప్‌లో నుంచి పొలాల్లోకి చేరుతున్న వర్షపునీరు

తొట్టంబేడు: మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా పంట పొలాలను వర్షపు నీరు ముంచెత్తుతోంది. రేణిగుంట– నాయుడుపేట మధ్య ఆరు లేన్ల జాతీయ రహదారిని నిర్మించారు. కన్నలి నుంచి పాయ్యకొత్తూరు వరకు సర్వీసురోడ్డు పక్కనే కాలువలు కట్టారు. వాటిని చెంబేడు కాలువకు అనుసంధానం చేయలేదు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరదనీరంతా పొల్లాలోకి చేరుతోంది. వరిపైరు మునిగిపోతోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సైడు కాలువలను పూర్తిచేసి చెంబేడు కాలువకు అనుసంధానం చేయాలని కోరుతున్నారు.

శ్రీకృష్ణదేవ రాయలకు ఘన నివాళి



శ్రీకృష్ణదేవరాయలకు నివాళులర్పిస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి: శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండు వద్ద రాయల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దీనికి హాజరైన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ మాట్లాడుతూ, తెలుగు భాష ఔన్నత్యాన్ని కవుల ద్వారా భారతదేశానికి చాటిచెప్పిన చక్రవర్తి కృష్ణ దేవరాయలు అని కొనియాడారు. రాయలసీమను రతనాలసీమగా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గరికపాటి చంద్రశేఖర్ బాబు, పగడాల ప్రతాప్, రిటైర్డ్ తహసీల్దార్ చంద్రశేఖర్, దేపూరు ప్రసాద్, కొండు గారి విజయకుమార్, పసుపులేటి జనార్దన్, పూల కష్ణమూర్తి, శ్రీపురం సుధా పాల్గొన్నారు.

తడి-పొడి చెత్తపై అవగాహన



ఆర్.అనంతాపురంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్.అనంతాపురం, జీఎన్‌కండ్రిగ గ్రామ పంచాయతీలలో శుక్రవారం ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తడి, పొడి చెత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులతో కలసి ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి డస్ట్‌బిన్‌లలో వేయాలని, పారిశుధ్య కార్మికులు ఇంటి వద్దకు వచ్చినప్పుడు అందివ్వాలని తెలిపారు. ఇంటి పరిసరాలను, గ్రామంలోని వీధులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం తలారివెట్టు గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మునెయ్య, ఏపీఓ దేవరి తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయానికి నూతన రోడ్డు



నూతన రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజనాయక్

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో వెలసిన ప్రఖ్యాత శైవక్షేత్రం శ్రీ ఆనందవల్లీ సమేత పరుశురామేశ్వర స్వామి దేవస్థానానికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజనాయక్ స్థల పరిశీలన చేశారు. త్వరలోనే రోడ్డు నిర్మాణానికి త్వరితగతిన చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. ఆర్అండ్‌బీ ఏఈ మధు, ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరి నాయుడు పాల్గొన్నారు.

గృహప్రవేశానికి మాజీ ఎమ్మెల్యే



ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి ఎంపీటీసీ మునిరెడ్డి నూతన గృహ ప్రవేశ మహోత్సవానికి శుక్రవారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. వారికి శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపికను అందజేశారు.

వేడుకగా ఊంజల్ సేవ

నారాయణవనం: పద్మావతీ అమ్మవారికి శుక్రవారం సాయంత్రం ఊంజల్ సేవ నేత్ర పర్వంగా కొనసాగింది. ఉదయం 7 గంటలకు వెంకటేశ్వరస్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు నిత్యకైంకర్యాలను నిర్వహించిన అర్చకులు తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని సుందరంగా అలంకరించి, అధిష్టింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఉయ్యాల సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోండి



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని అత్యంత రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండు సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి యథేచ్ఛగా దుకాణాలను ఏర్పాటు చేసుకుని విద్యుత్ స్తంభాన్ని కూడా ఆక్రమించి స్లాబ్ వేస్తున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయమని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, రొద్ద గోపి అన్నారు. వారు శుక్రవారం పురపాలక సంఘం అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున అత్యంత రద్దీగా ఉంటే ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఇంతలా అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. అతనిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు ఆక్రమణదారునిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబులెన్సు యూనియన్ నాయకులు అంజిబాబు, వెంకటేష్, ఏఐటీయూసీ నాయకులు జనార్దన్, మురళి పాల్గొన్నారు.

అప్రమత్తతతో దీపావళి వేడుకలు

శ్రీకాళహస్తి: దీపావళి పండుగను అప్రమత్తంగా చేసుకోవాలని అగ్నిమాపకశాఖ కేంద్ర అధికారి ఎస్.నాగేశ్వరరెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, వ్యాపారులు బాణసంచా విక్రయ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేసినట్లు వివరించారు. శ్రీకాళహస్తి పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాలల్లో 14 మంది తాత్కాలిక లైసెన్సు కలిగినవారు, ఐదుగురు శాశ్వత బాణసంచా లైసెన్సు విక్రయ దారులు ఉన్నారని చెప్పారు. వీరందరికి దీపావళి సందర్భంగా 17వ తేదీ నుంచి ఆర్టీసీ బస్టాండు వెనుక గల జూనియర్ కళాశాలలో దుకాణాలు ఏర్పాటుకు అనుమతించామన్నారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ బాణసంచా విక్రయాలు చేయకూడదని స్పష్టం చేశారు.

అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి

- రచ్చబండలో నూకతోటి రాజేష్ పిలుపు





నారాయణవనంలో రచ్చబండ, డిజిటల్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న రాజేష్, పార్టీ నాయకులు

నారాయణవనం: కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్ సీపీపై చేస్తున్న అసత్య, అవాస్తవ ప్రచారాలను బలంగా తిప్పికొట్టాలని సత్యవేదు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం నారాయణవనంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటి సంతకాల సేకరణ, క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు నమోదుపై చర్చించారు. ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల బాగోగులపై దృష్టి పెట్టకుండా వైఎస్ఆర్ సీపీ, నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ అసత్య ప్రచారాలు, తప్పుడు కేసులు పెడుతోందని అన్నారు. కూటమి తాటాకు చప్పుళ్లకు భయపడాల్సిన కాలం చెల్లిపోయిందని అన్నారు. కంటికి కనబడుతున్న నూతన మెడికల్ కళాశాలల భవనాలను కనికట్టు చేసి ప్రచారం చేస్తే ప్రజలు ఎలా నమ్ముతారని అన్నారు. కూటమి ఆరోపణలు, అవాస్తవ ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఆయన అన్నారు.

రచ్చబండతో వాస్తవాలు

కూటమి ప్రభుత్వం చేస్తున్న అవాస్తవాలను, ప్రచారాలను తిప్పికొడుతూ వాస్తవాలను అందరికీ తెలియజేసే రచ్చబండ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలని అన్నారు. గ్రామ కమిటీ, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విధిగా రచ్చబండలో పాల్గొని, కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో భాగసామ్యం కావాలని రాజేష్ అన్నారు. నియోజకవర్గంలో 50 వేలు లక్ష్యం కాగా, మండలం నుండి 6 వేల సంతకాలను నవంబర్ నాటికి సేకరించాలని ఆయన సూచించారు. ఆరు విభాగాలలో గ్రామ కమిటీల ఏర్పాటులో మహిళలకు, యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాజేష్ అన్నారు.

రామరక్షగా డిజిటల్ బుక్

కూటమి పాలనలో వేధించిన, అక్రమ కేసులు పెట్టిన కూటమి నాయకులు, అధికారుల వివరాలతో డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకుంటే వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో జగనన్న న్యాయం చేస్తారని రాజేష్ పేర్కొన్నారు. రచ్చబండలో డిజిటల్ బుక్ ఆవశ్యకతను వివరించాలన్నారు. కార్యకర్తలకు, నాయకులకు పార్టీ అండగా నిలుస్తుందన్న భరోసా కల్పించాలని అన్నారు. మండల కన్వీనర్ సొరకాయలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాకేష్ కిరణ్, రాష్ట్ర వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శి అన్నాదొరై, వైస్ ఎంపీపీ శివశంకర్, సర్పంచ్‌లు సాయిరవి, సుబ్రమణ్యంరెడ్డి, నాగూరు, ధర్మలింగం, మురళి, ఎంపీటీసీ సభ్యులు పొన్నుస్వామి, రవి, నాయకులు గురుస్వామి, కేజీ రవి, దొరైరాజ్, హేమచంద్రారెడ్డి, ఏలుమలై, సొరకాయలురెడ్డి, శరవణ, పద్మావతి, సాయి, మంజునాథ్, రామన్, లక్ష్మణ్, అశోక్ పాల్గొన్నారు.